క్లుప్తంగా

వరాహావతారంలో జగన్నాథుడు


వరహావతారంలో దర్శనమిస్తున్న జగన్నాథుడు

మునగపాక : మునగపాక, నాగులాపల్లి గ్రామాల్లో బలభద్ర, సుభద్ర సమేత శ్రీ జగన్నాథుడు గురువారం వరాహావతారంలో భక్తులకు దర్శనమిచ్చారు. ఆయా గ్రామాల్లోని జగన్నాథుని దర్శించుకునేందుకు భక్తులు తరలి వచ్చారు. వేదపండితుల మంత్రోచ్చరణల మధ్య ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. జగన్నాథుని నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా ఆలయాల్లో పూజలు నిర్వహిస్తున్నారు. ఈనెల 29న ఉత్సవాన్ని ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు.

నేడు విద్యుత్ నిలిపివేత

పాయకరావుపేట : పాయకరావుపేట గ్రామ పరిధిలో నేడు విద్యుత్ కండక్టర్ మార్చడం, విద్యుత్ మరమ్మతుల కారణంగా ఉదయం 7 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్టు ఏపీఈపీడీసీఎల్ అనకాపల్లి డివిజినల్ ఇంజినీర్ కె.రాజశేఖర్ తెలిపారు. పాయకరావుపేట పరిధిలో గల లింగాలకాలనీ, ఇందిరా కాలనీ, అంబేద్కర్ నగర్, దుర్గాకాలనీ, దుర్గానగర్, శాంతినగర్, షీలానగర్, ధనిశెట్టి నగర్, జి.వి.ఆర్.నగర్, ప్రశాంతి నగర్, రాజీవ్ నగర్ కాలనీ, పి.ఎల్.పురం, సీతారాంపురం, నామవరం గ్రామాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేస్తామని, వినియోగదారులు సహకరించాలని కోరారు.

ఎంఈవో-2కు అభినందనలు


రెండో ఎంఈవో జోష్‌కు శుభాకాంక్షలు తెలుపుతున్న ఏపీటీఎఫ్ నాయకులు

కోటవురట్ల: రెండో ఎంఈవోగా బాధ్యతలు స్వీకరించిన జోష్‌కు ఏపీటీఎఫ్ నాయకులు గురువారం శుభాకాంక్షలు తెలిపారు. ఆయనను ఎమ్మార్సీలో మర్యాదపూర్వకంగా కలుసుకుని పుష్పగుచ్ఛం ఇచ్చి అభినందించారు. మండలంలో విద్యాభివృద్ధికి తమ వంతు సహాయ సహకారాలు అందిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏపీటీఎఫ్ జిల్లా కార్యదర్శి సత్యాడ దాసు, నాయకులు ఎం.కృష్ణప్రసాద్, ఎస్.లచ్చబాబు, ఆనంద్‌రాజ్, సంగీత్‌రాజ్, జాన్ ప్రసాద్, జి.చిరంజీవి పాల్గొన్నారు.

మునగపాక పీహెచ్‌సీ వైద్యాధికారిగా విమల గిరి



మునగపాక : మునగపాక పీహెచ్‌సీ వైద్యాధికారిగా విమల గిరి నియమితులయ్యారు. వైద్య ఉద్యోగుల బదిలీల్లో భాగంగా ఇంతవరకు ఇక్కడి వైద్యాధికారిగా సేవలందించిన డాక్టర్ అనిల్‌కుమార్‌ను విజయనగరం జిల్లా ఎల్.కోటకు బదిలీ చేశారు.ఆయన స్థానంలో రోలుగుంట పీహెచ్‌సీ వైద్యాధికారి విమలగిరిని మునగపాక పీహెచ్‌సీకి బదిలీ చేశారు. ఆమె శుక్రవారం బాధ్యతలు స్వీకరించనున్నారు. మునగపాక పీహెచ్‌సీలో పనిచేసిన ఆరోగ్య పర్యవేక్షకుడు ఉమామహేష్‌ను అచ్యుతాపురం మండలం హరిపాలెం పీహెచ్‌సీకి బదిలీ చేశారు.

కోటవురట్లలో 'గడప గడపకు నేడు'

కోటవురట్ల : కోటవురట్ల సచివాలయం-1 పరిధిలో శుక్రవారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించనున్నట్టు వైఎస్సార్‌సీపీ రాష్ట్ర అదనపు కార్యదర్శి ఆర్.ఎస్.సీతారామరాజు తెలిపారు. ఉదయం 6 గంటలకు కార్యక్రమం ప్రారంభమవుతుందని, ఎమ్మెల్యే గొల్ల బాబూరావు ఇంటింటికీ వెళ్లి సమస్యలు తెలుసుకుంటారని తెలిపారు. స్థానిక సమస్యలు వివరించేందుకు గ్రామస్తులు సిద్ధంగా ఉండాలని, అధికారులు ప్రజా ప్రతినిధులు, వలంటీర్లు విధిగా హాజరు కావాలని సూచించారు.

ఆక్రమణలపై చర్యలు తీసుకోవాలి

రాంబిల్లి : పంచదార్ల పరిధిలో గల గెడ్డ ఆక్రమణలు, ప్రభుత్వ స్థలాల ఆక్రమణలపై చర్యలు తీసుకోవాలని వైఎస్సార్‌సీపీ నాయకుడు ఉప్పులూరి నాయుడు కోరారు. దీనిపై పంచదార్ల గ్రామ ప్రజలు ఫిర్యాదు చేసినా అధికారులు పట్టించుకోవడం లేదని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. గెడ్డ , ప్రభుత్వ స్థలాల ఆక్రమణల ద్వారా రైతులు ఇబ్బందులు పడుతున్నారని, అలాగే వర్షం నీరు పోయే మార్గం లేక సమీపంలో గల ఇళ్లు ముంపు బారిన పడుతున్నాయని పేర్కొన్నారు.

ప్రజలను తప్పుదోవ పట్టించేందుకే బస్సుయాత్ర

- ఉత్తరాంధ్రకు టీడీపీ తీరని ద్రోహం
- విశాఖను రాజధాని చేయడాన్ని వ్యతిరేకించారు..
- యాత్ర చేసే నైతిక హక్కు మీకెక్కడిది
- ధ్వజమెత్తిన వైఎస్సార్‌సీపీ నాయకులు


నక్కపల్లిలో విలేకర్లతో మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ నేతలు

నక్కపల్లి : ఉత్తరాంధ్ర ప్రజలను తప్పుదోవ పట్టించి, మళ్లీ మోసం చేసేందుకే టీడీపీ నాయకులు బస్సు యాత్ర చేపట్టారని వైఎస్సార్‌సీపీ నేతలు ఆరోపించారు. ఏపీయూఎఫ్‌డీసీ డైరెక్టర్ వీసం రామకృష్ణ, ఎంపీపీ రత్నం, జెడ్పీటీసీ కాసులమ్మ, మండల పార్టీ అధ్యక్షుడు పాపారావు తదితరులు గురువారం నక్కపల్లిలో విలేకర్లతో మాట్లాడుతూ విశాఖను కార్యనిర్వాహక రాజధాని చేయడాన్ని వ్యతిరేకించిన టీడీపీ నాయకులకు ఉత్తరాంధ్రలో పర్యటించే నైతిక హక్కు లేదన్నారు. టీడీపీ హయాంలో ఉత్తరాంధ్రకు తీరని అన్యాయం జరిగిందన్నారు. నలభై ఏళ్ల ఇండస్ట్రీ అని చెప్పుకుంటున్న చంద్రబాబు గతంలో తాను ముఖ్యమంత్రిగా పని చేసినపుడు హైదరాబాద్‌ను తప్ప రాష్ట్రాన్ని పట్టించుకోలేదన్నారు. తర్వాత అమరావతి రాజధాని పేరుతో భూములు లాక్కొని రాజధాని చుట్టూ బినామీలతో కొనిపించి రియల్ ఎస్టేట్ వ్యాపారం చేయిస్తున్నారన్నారు. ఉత్తరాంధ్ర అభివృద్ధి చెందడం టీడీపీ నాయకులకు ఇష్టం లేదన్నారు. ఉత్తరాంధ్రలో పదవులు అనుభవిస్తూ విశాఖను రాజధాని చేయడాన్ని వారంతా వ్యతిరేకిస్తున్నారన్నారు. వీరికి ఇక్కడ బస్సుయాత్ర చేసే హక్కు లేదన్నారు. నియోజకవర్గంలో ఒక్క శాశ్వతమైన అభివృద్ధి పని చేయకుండా ఐదేళ్లు ఎమ్మెల్యేగా పనిచేసిన అనిత కూడా ఇక్కడ సెల్ఫీ చాలెంజ్‌లు చేయడం సిగ్గుచేటన్నారు. టీడీపీ నాయకులు బస్సుయాత్ర పేరుతో మరోసారి ఉత్తరాంధ్ర ప్రజలను మోసం చేయాలని మభ్యపెట్టాలని, తప్పుదోవ పట్టించాలని చూస్తున్నారని ఆరోపించారు. ఇదంతా ప్రజలు గమనిస్తున్నారని, వచ్చే ఎన్నికల్లో తగిన గుణపాఠం చెబుతారన్నారు. ఈ సమావేశంలో వైస్ ఎంపీపీలు ఈశ్వరరావు, నానాజీ, స్టూడెంట్ విభాగం జిల్లా అధ్యక్షుడు కొప్పిశెట్టి హరిబాబు, సర్పంచ్‌లు భార్గవ్, వెంకటేష్, శంకర్రావు, ఎంపీటీసీలు తిరుపతిరావు, గొర్లగోవిందు, అల్లాడకొండ బంగార్రాజు తదితరులు పాల్గొన్నారు.

నేడు 'గడప గడపకు' విజయోత్సవ సభ

- నియోజకవర్గంలో సమస్యల పరిష్కారంపై సంతృప్తి
- జగనన్న సురక్ష ద్వారా ప్రజలకు నేరుగా ధ్రువపత్రాలు
- ఎమ్మెల్యే కన్నబాబు రాజు వెల్లడి


మాట్లాడుతున్న ఎమ్మెల్యే కన్నబాబు రాజు

అచ్యుతాపురం(అనకాపల్లి) : యలమంచిలి నియోజకవర్గంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం పూర్తి అయ్యిందని, తద్వారా ప్రజల సమస్యలను తెలుసుకొని పరిష్కరించడం సంతోషంగా ఉందని ఎమ్మెల్యే యు.వి. రమణమూర్తి రాజు అన్నారు. గురువారం అచ్యుతాపురం మండల పరిషత్ కార్యాలయం ఆవరణలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. యలమంచిలి మున్సిపాలిటీతో పాటు, నాలుగు మండలాల్లో ఈ కార్యక్రమం పూర్తి అయినందుకు అచ్యుతాపురం పోలీస్ గ్రౌండ్‌లో విజయోత్సవ సభ నిర్వహిస్తున్నట్టు తెలిపారు. ఇప్పటికే పలు ప్రజాసమస్యలు పరిష్కరించామని, ఈ కార్యక్రమం ఎంతో మంచి అనుభూతిని ఇచ్చిందని తెలిపారు. ఇటువంటి తరహాలోనే జగనన్న సురక్ష పథకం సీఎం మదిలోంచి పుట్టిందని, ప్రజలకు అవసరమైన 11 రకాల ధ్రువీకరణ పత్రాలను అందిస్తామని తెలిపారు. జిల్లా కలెక్టర్ల పర్యవేక్షణలో నెల రోజుల పాటు నిర్వహించే జగనన్న సురక్ష పథకం ద్వారా రోజుకు రెండు సచివాలయాల్లో జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమాన్ని తాను నేరుగా పర్యవేక్షిస్తానని అన్నారు. విలేకరుల సమావేశంలో డీసీసీబీ మాజీ చైర్మన్ సుకుమారవర్మ, జెడ్పీటీసీ లాలం రాంబాబు, ఎంపీపీ కోన బుజ్జి, బోదెపు గోవింద, శ్రీనుబాబు, జెడ్పీటీసీలు పెంటకోట సోము, నర్మాల కుమార్ పాల్గొన్నారు.

అర్హతే కొలమానంగా సంక్షేమ లబ్ధి


పందూరులో సమస్యలు తెలుసుకుంటున్న ఎమ్మెల్యే బాబూరావు

కోటవురట్ల : రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలతో ప్రతి కుటుంబానికి లబ్ధి చేకూరి ఆర్థికంగా నిలదొక్కుకునే అవకాశం కలుగుతోందని ఎమ్మెల్యే గొల్ల బాబూరావు అన్నారు. పందూరు గ్రామంలో గురువారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం ఎమ్మెల్యే నిర్వహించారు. తొలుత శివారు గ్రామం ములగలలోవలో ఇంటింటికీ వెళ్లి సంక్షేమ పథకాలు ఎలా అందుతున్నవీ అడిగి తెలుసుకున్నారు. రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలతో ఆ కుటుంబాలకు ఎంత లబ్ధి కలిగిందో వివరించారు. స్థానిక సమస్యలు తెలుసుకుని పరిష్కారానికి అధికారులకు ఆదేశాలిచ్చారు. అక్కడి నుంచి పందూరు గ్రామానికి చేరుకుని అక్కడ ఇంటింటికీ తిరిగారు. తమ గ్రామానికి సంబంధించి ప్రధాన సమస్యగా ఉన్న వంతెనను పూర్తి చేయాలని మహిళలు, యువకులు ఎమ్మెల్యేను కోరారు. ఇంచుమించు 45 రోజుల్లో అసంపూర్తిగా ఉన్న వంతెన పనులు ప్రారంభమవుతాయని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. వంతెన సమస్యను ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లామని, నిధులు కేటాయిస్తున్నట్టు హామీ ఇచ్చారని తెలిపారు. సచివాలయం వీధిలో విద్యుత్ స్తంభాలు లేక ఇబ్బందిగా ఉందని, ఏర్పాటు చేయాలని గ్రామస్తులు కోరారు. ఆ సమస్యను పరిష్కరించాలని విద్యుత్ శాఖాధికారులను ఎమ్మెల్యే ఆదేశించారు. ఇల్లు మంజూరు చేయాలని ఓ మహిళ కోరగా అర్హత ఉంటే వెంటనే మంజూరు చేయాలని ఎమ్మెల్యే సూచించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ నవరత్నాలు ప్రతి కుటుంబంలో వెలుగులు నింపుతున్నాయన్నారు. చిరు వ్యాపారులు, కులవృత్తుల వారిని, మహిళలను ఆదుకున్న ఘనత ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డిదే అన్నారు. ఖరీఫ్ సీజనుకు ముందుగానే అన్నదాతలకు ఆసరా కలిగేలా రైతు భరోసా నిధులు జమ చేశారన్నారు. పెట్టుబడి నిధులు ఇవ్వడమే కాకుండా ఆర్బీకేల ద్వారా విత్తనాలు, ఎరువులు, వైఎస్సార్ యంత్రసేవ పథకం ద్వారా యంత్రాలను అందించి రైతులకు అండగా ఉంటున్నారన్నారు. చంద్రబాబు బూటకపు మాటలు నమ్మొద్దన్నారు. రాష్ట్ర ప్రజల క్షేమాన్ని కాంక్షించే జగన్‌కు మళ్లీ అవకాశం ఇవ్వాలన్నారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ రాష్ట్ర అదనపు కార్యదర్శి ఆర్.ఎస్.సీతారామరాజు, సర్పంచులు చీకట్ల జగదీష్, కోసూరు అప్పారావు, కోసూరు అప్పారావు, సిహెచ్.గోపాలకృష్ణ, ఎంపీటీసీ పెట్ల రాంబాబు, పార్టీ నాయకులు సిద్దాబత్తుల సత్యనారాయణ, శ్రీపతిరాజు, గెంజి వెంకటరమణ, చీకట్ల భాస్కరరావు, బాబీ, చీకట్ల వెంకట్, శానాపతి రామునాయుడు, కొమారు రమణ, గొల్లు చిట్టిబాబు, పైల నాని, చవ్వాకుల చిన్న, ఉగ్గిన ఈశ్వరరావు, శానాపతి రామునాయుడు, కొమారు రమణ, రమేష్, గొర్లె నానిబాబు, మండల బూత్ కమిటీ కన్వీనర్ ఎస్.వి. రమణమూర్తి, తహసీల్దారు జానకమ్మ, ఏవో చంద్రశేఖర్, డీటీ సోమశేఖర్, ఎస్‌ఐ నారాయణరావు, వివిధ శాఖల అధికారులు, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.

సమస్యలుంటే నా దృష్టికి తీసుకురండి


అచ్యుతాపురంలో నవరత్నాల అమలుపై స్థానికుడి వద్ద ఆరా తీస్తున్న ఎమ్మెల్యే కన్నబాబురాజు

అచ్యుతాపురం(అనకాపల్లి) : ప్రజల సమస్యల పరిష్కారమే లక్ష్యంగా గడప గడపకు మన ప్రభుత్వం నిర్వహించామని ఎమ్మెల్యే రమణమూర్తిరాజు (కన్నబాబు) అన్నారు. అచ్యుతాపురం మండలంలోని దుప్పుతూరు సచివాలయం పరిధిలో ఉన్న అచ్యుతాపురంలో గురువారంతో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం ముగిసింది. ఈ సందర్భంగా ఇంటింటికీ వెళ్లి ఎమ్మెల్యే నవరత్నాల అమలు తీరుపై ఆరా తీశారు. ఎవరికైనా సమస్యలు ఉంటే తన దృష్టికి తీసుకురావాలని సూచించారు. అన్ని వర్గాలకు న్యాయం చేయడమే ప్రభుత్వ లక్ష్యం అని అన్నారు. కార్యక్రమంలో డీసీసీబీ మాజీ చైర్మన్ సుకుమార వర్మ, ఎంపీపీ కోన బుజ్జి, జెడ్పీటీసీ లాలం రాంబాబు, కోఆప్షన్ జెడ్పీ సభ్యుడు నర్మాల కుమార్, సర్పంచ్ విమలనాయుడు, మాజీ ఎంపీపీ చేకూరి శ్రీనివాసరాజు పాల్గొన్నారు.

ముగింపు సభకు తరలిరండి


మాట్లాడుతున్న ఒంపోలు సచివాలయ కన్వీనర్ సూర్యనారాయణ

మునగపాక: అచ్యుతాపురం మండల కేంద్రంలో శుక్రవారం నిర్వహించే గడపగడపకు ముగింపు సభకు పార్టీ శ్రేణులు భారీగా తరలిరావాలని ఒంపోలు సచివాలయ కన్వీనర్,వైఎస్సార్‌సీపీ సీనియర్ నేత నరాలశెట్టి సూర్యనారాయణ పిలుపునిచ్చారు. మునగపాకలోని బొడ్డేడ క్యాంప్ కార్యాలయంలో పార్టీ నేతలతో ఆయన సమావేశమయ్యారు. 'గడప గడపకు' కార్యక్రమం ద్వారా నాలుగేళ్ల కాలంలో అందిన లబ్ధిని ప్రజలకు వివరించే అవకాశం కలిగిందన్నారు. యలమంచిలి నియోజకవర్గంలో నాలుగు మండలాల్లో ఎమ్మెల్యే రమణమూర్తిరాజు ఈ కార్యక్రమాన్ని దిగ్విజయంగా పూర్తి చేశారన్నారు. ఈ నేపథ్యంలో నిర్వహించే బహిరంగ సభకు ఉత్తరాంధ్ర ఇన్‌చార్జి వై.వి.సుబ్బారెడ్డితో పాటు మంత్రులు హాజరవుతారన్నారు. సమావేశంలో సర్పంచ్‌లు గంగప్పలనాయుడు, బొడ్డేడ శ్రీనివాసరావు, ఎంపీటీసీలు వీరునాయుడు, ఇల్లా శిరీషా నాగేశ్వరరావు, మాజీ ఎంపీటీసీ పెంటకోట అప్పలనాయుడు, పార్టీ నేతలు గుంట్ల అప్పారావు, చదరం అప్పలనాయుడు, బుజ్జి, రామజోగినాయుడు, దశావతారం, భాస్కరరావు, మొల్లేటి చందు పాల్గొన్నారు.

దిశ యాప్‌తో మహిళలపై అఘాయిత్యాల నిరోధం


కొక్కిరాపల్లి గురుకుల పాఠశాలలో విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న ఎస్‌ఐ సన్నిబాబు

యలమంచిలి : బాలికలు, మహిళలపై జరుగుతున్న అఘాయిత్యాల నిరోధానికి సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించుకోవాలని రూరల్ ఎస్‌ఐ కె.సన్ని బాబు అన్నారు. గురువారం యలమంచిలి మున్సిపాలిటీ కొక్కిరాపల్లి గురుకుల పాఠశాలలో విద్యార్థులకు నేటి సమాజంలో స్త్రీల పై జరుగుతున్న అఘాయిత్యాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఇటీవల కాలంలో బాలికలపై ఎక్కువగా అఘాయిత్యాలు, లైంగిక వేధింపులు, ర్యాగింగ్‌లు చోటుచేసుకుంటున్నాయని తెలిపారు. ప్రతి ఒక్కరూ తమ మొబైల్‌ఫోన్‌లో దిశ యాప్‌ను ఇన్‌స్టాల్ చేసుకోవడం ద్వారా ఎవరైనా ఆపదలో ఉంటే వారున్న లొకేషన్‌ను సులభంగా గుర్తించడం ద్వారా వారిని ఆదుకోవడానికి వీలవుతుందని తెలిపారు. యుక్త వయస్సులో చెడు స్నేహాలకు దూరంగా మెలగాలని, ఇంటర్‌నెట్‌లు, ఫోన్‌లను సదుపయోగం చేసుకోవాలని, అలాగే గుడ్‌టచ్ బ్యాడ్ టచ్‌పై అవగాహన కలిగి ఉండాలని, అపరిచిత వ్యక్తులతో జాగ్రత్తగా వ్యవహరించాలని, విద్యార్థులు చట్టాలపై అవగాహన పెంచుకోవాలని సూచనలు చేశారు. టెన్త్, ఇంటర్ విద్యార్థి దశలో కీలకమెట్టని, ప్రభుత్వం అందిస్తున్న సహాయ సహకారాలతో ప్రతి ఒక్కరూ బాగా చదువుకుని ఉన్నత భవిష్యత్తు సొంతం చేసుకోవాలని అన్నారు. ఎవరైనా మాదక ద్రవ్యాలు వినియోగిస్తున్నట్టు తెలిస్తే తమకు సమాచారం తెలపాలని, ప్రతి ఒక్కరూ వ్యక్తిగత భద్రత పాటించాలని తెలిపారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ మళ్ల మాణిక్యం, మహిళా పోలీసులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

యువత సన్మార్గంలో నడవాలి


మాట్లాడుతున్న ఎస్‌ఐ ఆలీ షరీఫ్

మునగపాక : యువత సన్మార్గంలో నడవాలని ఎస్‌ఐ మహమ్మద్ ఆలీ షరీఫ్ కోరారు. అసాంఘిక కార్యక్రమాలకు ప్రతి ఒక్కరూ దూరంగా ఉండాలన్నారు. మునగపాక మెయిన్‌రోడ్డులో గురువారం విద్యార్థులతో ర్యాలీ, మానవహారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యువత విలువైన జీవితాన్ని నాశనం చేసుకోకుండా మంచి అలవాట్లపై దృష్టి సారించాలన్నారు. మద్యం, గంజాయి వంటి మాదకద్రవ్యాలకు దూరంగా ఉండేలా చూడాలన్నారు. తద్వారా ఆరోగ్యవంతంగా ఉండగలమన్నారు. ఆరోగ్యానికి హాని కలిగించే చెడు వ్యసనాల జోలికి పోరాదన్నారు. పోలీసు సిబ్బంది, విద్యార్థులు కార్యక్రమంలో పాల్గొన్నారు.

తహసీల్దార్ కార్యాలయానికి కొత్త శోభ


సుందరంగా దర్శనమిస్తున్న తహసీల్దార్ కార్యాలయం

మునగపాక : అసిస్టెంట్ కలెక్టర్ ధాత్రిరెడ్డి చొరవతో మునగపాక మండల తహసీల్దార్ కార్యాలయం సుందరంగా దర్శనమిస్తుంది. తహసీల్దార్ కార్యాలయం శిథిలావస్థకు చేరడంతో పాటు గదుల్లోని స్లాబ్‌లు పలుచోట్ల ప్రమాదకరంగా ఉండడంతో విధులు నిర్వహించే ఉద్యోగులు భయం గుప్పిట్లో ఉండేవారు. తహసీల్దార్ కార్యాలయంలో పనిచేసే ఉద్యోగులు సమీపంలోని మండల పరిషత్ కార్యాలయంలో విధులు నిర్వహిస్తున్నారు. ఇటీవల మునగపాక మండలానికి తహసీల్దార్ హోదాలో వచ్చిన అసిస్టెంట్ కలెక్టర్ ధాత్రిరెడ్డి సమస్యను గుర్తించారు. దీంతో నిధులు సమకూర్చి కార్యాలయాన్ని అన్ని హంగులతో సుందరంగా తీర్చిదిద్దేలా చర్యలు చేపట్టారు. ప్రస్తుతం పనులు చివరి దశకు చేరుకున్నాయి. తహసీల్దార్ కార్యాలయం చూపరులను ఆకట్టుకుంటుంది.

అణుకు సమస్యలు పరిష్కరించాలి


మండల పరిషత్ కార్యలయం ఎదుట బైఠాయించిన గిరిజనులు

కోటవురట్ల: అణుకు గిరిజన గ్రామంలోని ప్రధాన సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ సీపీఎం ఆధ్వర్యంలో గిరిజనులు గురువారం ఆందోళన కార్యక్రమం నిర్వహించారు. ఇందులో భాగంగా మండల పరిషత్ కార్యాలయం ఎదుట బైఠాయించి ఆందోళన చేశారు. సీపీఎం డివిజన్ కార్యదర్శివర్గ సభ్యుడు ఎం.అప్పలరాజు మాట్లాడుతూ అణుకు గిరిజనుల సమస్యలపై పలుమార్లు పోరాటం చేశామని అధికారులు నిమ్మకు నీరెత్తినట్టుగా వ్యవహరించడం ఆవేదన కలిగిస్తోందన్నారు. గిరిజన గ్రామంలో సుమారు 30 మంది చిన్నారులు విద్య కోసం 12 కిలోమీటర్లు రాళ్లల్లో నడుచుకుని వెళ్లాల్సి వస్తోందన్నారు. ఇంకా చాలా మంది చిన్నారులు విద్యకు దూరమవుతున్నారని వారి బంగారు భవిష్యత్‌ను అధికారులే కాలరాస్తున్నారని మండిపడ్డారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి అణుకులో పాఠశాలను ఏర్పాటు చేయడంతో పాటు రహదారిని అభివృద్ధి చేయాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో పోరాటాన్ని ఉద్యమంగా మారుస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో మండల కన్వీనర్ జి.డేవిడ్‌రాజ్, గిరిజనులు పాల్గొన్నారు.

సీపీఎం పాదయాత్ర పోస్టర్ ఆవిష్కరణ

రాంబిల్లి: పోలవరం నిర్వాసితులకు న్యాయం చేయాలని సీపీఎం మండల కార్యదర్శి దేముడునాయుడు కోరారు. పోలవరం నిర్వాసితుల సమస్యలు పరిష్కారం కోరుతూ సీపీఎం నిర్వహించే పాదయాత్రకు సంబంధించిన పోస్టర్‌ను ఆయన రాంబిల్లిలో గురువారం ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో పవన్, రాము తదితరులు పాల్గొన్నారు.

ప్రతిష్టాత్మకంగా జగనన్న సురక్ష కార్యక్రమం


మాట్లాడుతున్న డీఎల్‌డీవో మంజులావాణి

మునగపాక:ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన జగనన్న సురక్ష కార్యక్రమాన్ని ప్రతి ఒక్కరూ బాధ్యతగా తీసుకోవాలని డీఎల్‌డీవో మంజులావాణి కోరారు. స్థానిక మండల పరిషత్ హాలులో గురువారం పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ ఉద్యోగులు, వీఆర్వోలతో సమావేశమయ్యారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఇంతవరకు అర్హులై ఉండి పథకాలు అందని వారు ఉంటే గుర్తించి వారికి అవకాశం కల్పించాలన్నారు. అలాగే వలంటీర్లు ఈ కార్యక్రమం నిర్వహణ విషయంలో నిర్లక్ష్యం చేయకుండా అవగాహన కల్పించాలన్నారు. ప్రభుత్వ లక్ష్యాన్ని ప్రతి ఒక్కరూ చేరుకోవాలన్నారు. ఎంపీపీ మళ్ల జయలక్ష్మి, జెడ్పీటీసీ స్వామి సత్యనారాయణ, ఎంపీడీవో మన్మథరావు, ఈవోఆర్డీ ఈశ్వరరావు, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ ఆడారి అచ్చియ్యనాయుడు, ఎంఎల్‌వో సంజయ్, పీఏసీఎస్ పర్సన్ ఇన్‌చార్జి రామ్మోహనరావు పాల్గొన్నారు.

జోరుగా అచ్యుతాపురం-అనకాపల్లి రోడ్డు మరమ్మతు పనులు


తారు రోడ్డు వేస్తున్న దృశ్యం

అచ్యుతాపురం (అనకాపల్లి): అచ్యుతాపురం-అనకాపల్లి మార్గంలో మరమ్మతు పనులు వేగంగా సాగుతున్నాయి. ఈ రహదారిని విస్తరించేందుకు ఓ వైపు ప్రక్రియ సాగుతున్నప్పటికీ వాహనదారుల కష్టాలను చూసి మంత్రి గుడివాడ అమర్‌నాథ్, ఎమ్మెల్యే కన్నబాబురాజు ఆర్‌అండ్‌బీ అధికారులపై ఒత్తిడి తీసుకొచ్చి మరమ్మతు పనులు చేయిస్తున్నారు. ముందుగా చిన్న గోతులను పూడ్చిన ఆర్‌అండ్‌బీ, తాజాగా రహదారి పాడైన ప్రాంతంలో మొత్తం రోడ్డుని పెకిలించి రాళ్లతో రోలింగ్ చేయించారు. తాజాగా ఆ రోలింగ్ చేసిన ప్రాంతంలో పక్కగా తారు రోడ్డు వేయడంతో వాహన చోదకులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. నిత్యం సెజ్ వాహనాలు, కార్మికుల వాహనాలు, ప్రయాణికుల రద్దీతో ఈ రోడ్డు అత్యంత ప్రాధాన్యం సంతరించుకుంది. మరమ్మతు పనులు వేగంగా సాగుతుండడంతో వాహన చోదకుల కష్టాలు తీరినట్లే. రోడ్డు విస్తరణ పూర్తయితే అనకాపల్లి-అచ్యుతాపురం రాకపోకలు సాఫీగా జరిగిపోతాయి.

జగనన్న గోరుముద్ద బాగుంది..


భోజనం రుచి చూస్తున్న ఎంఈవో-2 జోష్

కోటవురట్ల : రాష్ట్ర ప్రభుత్వం విద్యకు అధిక ప్రాధాన్యం ఇస్తోందని, ఇందులో భాగంగానే పాఠశాలను అభివృద్ధి చేయడమే కాకుండా విద్యార్థులకు జగనన్న గోరుముద్దను అందిస్తోందని రెండో ఎంఈవో జోష్ అన్నారు. స్థానిక జెడ్పీ బాలికోన్నత పాఠశాలను ఆయన గురువారం ఆకస్మిక తనిఖీ చేసి రికార్డులు, పాఠశాల పరిసరాలు పరిశీలించారు. పిల్లలకు అందిస్తున్న గోరుముద్దను రుచి చూసి సంతృప్తి వ్యక్తం చేశారు. రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యాన్ని నెరవేర్చేలా నాణ్యమైన భోజనాన్ని విద్యార్థులకు అందించాలని సూచించారు.

విత్తన శుద్ధి విధిగా చేసుకోవాలి


విత్తన శుద్ధిపై అవగాహన కల్పిస్తున్న వ్యవసాయాధికారులు

ఎస్.రాయవరం : ఖరీఫ్ సీజన్‌కు సిద్ధమయ్యే రైతులు విత్తన శుద్ధి విధిగా చేసుకోవాలని మండల వ్యవసాయాధికారి సౌజన్య సూచించారు. గుర్రాజుపేట గ్రామంలో రైతు భరోసా కేంద్రం వద్ద గురువారం విత్తన శుద్ధి కార్యక్రమంపై మాక్ డ్రిల్ నిర్వహించారు. ఏవో మాట్లాడుతూ ఖరీఫ్ సీజన్‌కు అవసరమైన విత్తనాలు ఇప్పటికే రైతు భరోసా కేంద్రాల్లో అందుబాటులో ఉంచామన్నారు. మరిన్ని వెరైటీలు అవసరమైన రైతులు రైతు భరోసా కేంద్రంలో నమోదు చేసుకుంటే వారం రోజుల్లో విత్తనాలు అందిస్తామన్నారు. అనంతరం విత్తన శుద్ధికి మెలకువలను వివరించారు. రైతులు నారు వేసే ముందు మొలకకట్టే కార్యక్రమం చేయాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో సచివాలయ వ్యవసాయ సహాయకుడు ప్రసాద్, స్థానిక రైతులు శివ, రమణ పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

అనకాపల్లిటౌన్ : పట్టణ పరిధిలో విద్యుత్ వైర్ల క్రింద జంగిల్ క్లియరెన్స్‌లో భాగంగా శుక్రవారం ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరాను నిలుపుదల చేయనున్నట్టు ఈపీడీసీఎల్ డివిజన్ ఈఈ(ఆపరేషన్) కె.రాజశేఖర్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉడ్‌పేట ఫీడర్ పరిధిలో అంజయ్యకాలనీ, గాంధీనగరం, న్యూబర్మాకాలనీ, ఉడ్‌పేట, చాకలిపేట, వేల్పులవీధి, చోడవరం ఆర్టీసీ కాంప్లెక్స్ రహదారి, నర్సింగరావుపేట, నెయ్యిలవీధిలో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడనుందన్నారు. ఆయా ప్రాంతాల ప్రజలు విద్యుత్‌శాఖ అధికారులకు సహకరించాల్సిందిగా కోరారు.

ప్రైవేట్ విద్యా సంస్థల దోపిడీని అరికట్టాలని వినతి

తుమ్మపాల : ప్రైవేటు విద్యాసంస్థల ఫీజు దోపిడీని అరికట్టాలని కోరుతూ జిల్లా విద్యాశాఖ అధికారులకు బహుజన సమాజ్ పార్టీ జిల్లా ఇన్‌చార్జి సూదికొండ మాణిక్యాలరావు వినతి పత్రం అందించారు. ప్రైవేటు పాఠశాలల్లో తమ పిల్లలను చేర్పిస్తే పిల్లల భవిష్యత్ బాగుంటుందనే నమ్మకాన్ని అవకాశంగా చేసుకుని ఫీజుల రూపంలో భారీగా దోచుకుంటున్నారని వినతి పత్రంలో పేర్కొన్నారు. ఫీజులతో పాటు పుస్తకాలు, యూనిఫాం తదితర సామగ్రి అమ్మకాలను స్కూళ్లోనే నిర్వహిస్తున్నారని, ఈ దోపిడీని అరికట్టేందుకు చర్యలు తీసుకోవాలని కోరారు.

మట్టి ట్రాక్టర్ సీజ్


మట్టి ట్రాక్టర్

మునగపాక : మండలంలోని గణపర్తిలో ఎటువంటి అనుమతులు లేకుండా మట్టి తరలిస్తున్న ట్రాక్టర్‌ను మునగపాక పోలీసులు పట్టుకున్నారు. గ్రామంలో అనధికారికంగా మట్టి తవ్వుతున్నట్టు అందిన ఫిర్యాదు మేరకు బుధవారం రాత్రి పోలీసులు దాడి చేశారు. సంఘటన స్థలంలో మట్టిని తరలిస్తున్న ట్రాక్టర్‌ను పట్టుకొని స్టేషన్‌కు తరలించారు. ఎటువంటి అనుమతులు లేకుండా ఇసుక అలాగే మట్టిని తవ్వినా చర్యలు తప్పవని హెచ్చరించారు.